# పండిన మనసూ కాలిన వయసూ

మావారు వస్తున్నారీవేళ.

ఈ ఆలోచనల పులకరింతలతో రాత్రంతా నిద్రపట్టలేదు. ఆమాటకొస్తే రాత్రన్నమాటే ఏమిటి? పదిరాత్రుల నుండి నిద్రపట్టటంలేదు. మధుర నదీ స్నానాలతో, వింత ఆలోచనలతో లేచి కూర్చోవడమే.

ఈరోజు ఈ భూమ్మీద నాకంటే అదృష్టవంతురాలు వేరు లేదు. ఎంతో మంది భార్యలు నాకంటే తమ పతుల్ని ప్రేమించివుంటే వుండురు గాక. ఇంతటి వియోగమాధురి, సహనసౌందర్యం ఎవ రనుభవించి వుంటారు.

ఇతర దాంపత్యాలని చూసి నేను పడిన అసూయే, ఈనాడింత ఆనందాన్ని రగులుస్తోంది. అంతటి అసూయ లేకపోతే యింతటి ఆనందమూ లేదు.

"ఎంత మంచివారు మావారు!"

అవును. ఈరోజు వారిలోని మంచి తనమే హిమాలయ శిఖరమంత ఉన్నతంగా కనిపిస్తోంది. వారివల్ల నేను మానసికంగా అనుభవించిన హింసను పదిరోజుల క్రితమే, వారు వస్తున్నారన్న వార్త విన్నప్పుడే క్షమించేశాను.

ఇప్పుడు క్షమించానన్న విషయం ఎంతో కష్టంమీదగానీ గుర్తురావడంలేదు.

విశాలమైన నా గదిలో, ఎత్తయిన పందిరిమంచంమీద, పాలమీగడలాంటి మెత్తని తెల్లని పరుపుమీద ఒక రాణిలా పడుకుని, తెరిచివున్న కిటికీద్వారా లోపలకు వస్తోన్న చల్లని గాలుల్ని పీలుస్తూ, మబ్బులులేని ఆకాశంలో హాయిగా విహరించే శుక్లపక్షపు చందమామని చూస్తూ, కళ్ళులా విప్పుకుని, వెన్నెల పరచినట్లు పడుకుని, నిట్టూర్పులు విడుస్తూ... ఎంత దీర్ఘమైన రాత్రిగడిపాను!

అది అంతులేని రాత్రిలా, తెల్లవారని రాత్రిలా, నిర్దయతోకూడిన రాత్రిలా, కవ్వించే రాత్రిలా, పరిహాసమాడే రాత్రిలా కనిపించింది.

నాకు నేను కధలు చెప్పుకున్నాను. కళ్లుతెరుచుకుని కలలు కన్నాను.

తెల్లవారకుండ మానిందా? నేనే గెలిచాను. తూర్పున తొలిరేకలు విచ్చుకున్నాయి. నేను లేచి, గదితలుపులు తెరిచి, వాష్ బేసిన్ దగ్గర దంతాధావనం చేసుకుని యివతలకు వచ్చాను. పనిమనిషి వచ్చి ''అమ్మగారూ!'' అని పిలిచింది.

వెళ్ళి తలుపులు తీశాను. దాని చేతిలో రెండు పాలగిన్నెలున్నాయి.

"పాలు ఎక్కువ తెమ్మంటే రెండు గిన్నెల్లో పట్టుకొచ్చావేమిటి పార్వతీ!" అన్నాను.

మా పనిమనిషి పార్వతికి గేదెలు కూడా వున్నాయి. మా పాలమనిషి కూడా తనే.

"కాదమ్మగారూ! నిన్న మా రెండో బర్రె యీనిందని చెప్పాను కదూ! జున్నుపాలుకూడా పట్టుకువచ్చాను," అంటూ లోపలకు వచ్చింది.

జున్నంటే నాకెంత యిష్టమని! నా బాల్యమంతా పల్లెటూళ్లోనే గడిచింది. అప్పట్లో నేను చదువురాని మొద్దుని, తోటల్లో తిరుగుతూ, గోరింటాకు రకరకాల ఆకృతుల్లో చేతులకూ, కాళ్ళకూ పెట్టుకుంటూ, అట్లతద్దెకి ప్రొద్దున్నే లేచి పెరుగన్నం తిని, ఏటికి వెళ్ళి స్నానంచేసివచ్చి, రావిచెట్టుకు కట్టిన ఉయ్యాలమీద తోడి ఆడపిల్లలతో ఊగుతూ...

అట్లా ఊగుతుంటే "మొగుడి పేరు చెప్పవే" అనేవాళ్లు తోటి ఆడపిల్లలు.

నే నందరితోనూ చెప్పించేదాన్నిగాని నేను మాత్రం మొండిదానిలా చచ్చినా చెప్పేదాన్ని కాదు.

వాళ్ళు మొగుడిపేరు నాతో చెప్పించలేక "పెంకిపిల్లా; అయితే ఎదురుగానున్న కొమ్మమీది ఆకునయినా కోసుకునిరా. అప్పటిదాకా నిన్ను వదలిపెట్టం," అని విసురుగా పెద్దపెద్ద ఊపులు ఊపేవాళ్లు.

తలుచుకుంటే భయంతో వళ్ళు గగుర్పొడుస్తుంది. ఎంతెంత పెద్ద ఊపులనీ-పైకి, యింకాపైకి, ఆకాశంలోకి ఎగిరిపోతూ, కళ్లు తిరిగిపోగా క్రింద పడిపోతానన్న భయంతో, మధ్యమధ్య కళ్లు గట్టిగా

కొమ్మూరి వేణుగోపాలరావు

మూసుకుంటూ, అయినా మొండిపట్టు వొంపలేక నిల[illegible]కని, చివరికి ఎలా నైతేనేం ఎదురుగా కనిపించే కొమ్మమీది ఆకుని కోసి తెచ్చేదాన్ని.

ప్రతి పదిహేను రోజులకూ ఒకసారి జున్ను. మా నాన్న కరణం కాబట్టి ఎవరోఒకరు పాలు పంపిస్తూ వుండేవాళ్లు. ఒకొక్కసారి నేను చుట్టాలింటికి ప్రక్క ఊరికి వెడితే మా వాళ్లు నా కోసం జున్ను భద్రంగా దాచి వుంచేవాళ్లు.

"చూడు పార్వతీ! పెరట్లో పొయ్యి మీద కాగు పెట్టి అందులో కాసిని నీళ్లు పోసి, ఆ నీళ్ళలో జున్నుపాలగిన్నె పెట్టి ఆవిరిలో వుడకనిద్దాం. చాలా మందికి బెల్లం వేసుకుంటే ఇష్టం. నాకు చక్కెరతో చేస్తేనే బాగుంటుంది. అందులో పలకుల పొడి, కాసిని మిరియాలుకూడా వేద్దాం. పదపద ఎక్కువ టైములేదు," అని ఆమెను తొందరపెట్టాను.

అన్నట్లు యివేళ నా పుట్టింరోజు.

నా పుట్టినరోజు, ఇన్నాళ్ళ వియోగం తర్వాత మా యిద్దరి కలయికకూ పుట్టిన రోజు కావటం...ఎంత తియ్యని మలుపు!

ఆయనకీ విషయం తెలియదు. అయినా ఏ అజ్ఞాతశక్తు లాయన్ని ప్రేరేపించాయో, యివాళే యిక్కడి కడుగు పెడుతున్నారు.

పార్వతి నా ముఖం వంక పరీక్షగా చూస్తూ "అమ్మగారూ! రాత్రంతా నిద్ర లేదల్లేవుంది. అయ్యగారు రాకముందే నిద్ర వుండటం లేదు... రాకముందే" అని ఒత్తిపలుకుతూ.

"పోవే. చిలిపి మాటలు మాట్లాడక వెళ్ళి పనిచూసుకో" అన్నాను గదమాయిస్తున్నట్లుగా.

పార్వతి నవ్వుకుంటూ వెళ్ళింది.

పాతికేళ్ళుంటాయి పార్వతికి. ప్రపంచంలో అందరి దగ్గరా గంభీరంగా వున్నాను గాని ఆమెదగ్గర గంభీరంగా వుండటం చేతకాలేదు. అలా వుండనివ్వ లేదు నన్ను. ఎప్పుడూ చిలిపిమాట లంటూ కవ్విస్తూ, నాకు ఆప్తురాలిగా చెలికత్తెగా అయిపోయింది.

పార్వతికి రెండు పరుళ్ళు పోశాను నేను.



కిచెన్‌లోకి వచ్చి గ్యాస్ స్టవ్ మీద యిదు నిముషాల్లో కాఫీ తయారుచేసు న్నాను.

పార్వతిని పిలిచి స్టీల్ గ్లాసులో మెకుకూడా కాఫీ యిచ్చి, గుమ్మంమీద ూర్చుని కాఫీ త్రాగుతున్నాను.

ఎంతబావుంది కాఫీ! నేనింత బాగా స్తానా అన్న ఆశ్చర్యం ఆవహించింది.

తర్వాత లేచి యిల్లంతా కలయ తిరి ను. ఒకచోట కూర్చోబుద్ధికావటం దు. పిచ్చిదానిలా ఆ గదిలోంచి యీ దిలోకి, యీ గదిలోంచి ఆ గదిలోకి రుగుతున్నాను. ఆధునికంగా అమర్చిన చెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డ్ రూమ్, లైబ్రరి రూమ్, పెద్ద హాలు, డాయింగ్ రూమ్ ... అన్ని తీర్చిదిద్దినట్లు భ్రంగా, అందంగా, మొజాయిక్ ్లోరింగుతో, ఆ గదులకి తగిన అలంకరణతో ద్దులొలుకుతున్నాయి. ఇంత పెద్ద ంటిలో యిన్నాళ్ళూ నే ఒక్కదాన్నీ వసించానా అనిపించింది. ఇంత వంటరి నం ఎలా భరించానా అనిపించింది. ఇహ క్క క్షణంకూడా యీ వంటరితనం రించలే ననిపించింది.

కారిడార్‌లోకి వచ్చి నిల్చున్నాను. ోర్టికోలో హుందాగా నిలిచివున్న ంబాసిడర్ కారు, యిరు ప్రక్కలా నేను ప్రేమగా పెంచుకున్న చిన్ని తోట, మొక్కలకు పూచిన రంగు రంగుల పువ్వులు, క్రోటన్లు, సన్నగా, పొడువుగా, లంగా పెరిగిన పైన్ చెట్లూ ... యిదంతా నా పరిరక్షణ. వీటికి అధికారి వేరే వున్నాడు. అత నీవేళ వస్తున్నాడు.

కాసేపు పెరట్లోకి వెళ్ళి నేను పెంచు కుంటూన్న పావురాలనూ, కుందేళ్ళనూ, ఎక్వేరియంలోని బంగారు చేపల్ని పలక రించాను.

పార్వతి నా దగ్గరకొచ్చి "అమ్మ గారూ! బాయిలర్‌లో నీళ్ళు మరిగిపో తున్నాయి. నీళ్ళు తోడి తలంటుతాను రండి" అన్నది.

నాకు చచ్చే సిగ్గువేసింది. "ఏమిటి? నువ్వు నాకు తలంటుతావా? మరి చిలిపి దానవవుతున్నా వేమిటే?" అన్నాను కాస్త కోపం నటిస్తూ.

పార్వతి నా వంక ఆప్యాయంగా చూసింది. "అదేమిటమ్మగారూ అలా అంటారు. అందరు అమ్మగార్లూ అందరి పని వాళ్ళతో పోయించుకోటంలేదూ? మీకు ఒక్కసారైనా తలంటు పోయాలని నా కోరిక. కాదనకండి" అంది బ్రతిమిలాడు తున్నట్లుగా.

"నీ కోరిక మండిపోయినట్లుగానే వుందిగాని, నాకు అలాంటివి సిగ్గు. నీళ్లు తోడు. నేను పోసుకుంటానులే" అని కొంచం ఖండితంగానే జవాబు చెప్పాను.

"పొండమ్మగారూ! మీ రెప్పుడూ యింతే" అని పార్వతి ముడుచుకుని బాయి లరు దగ్గరకువెళ్ళి కుళాయి త్రిప్పింది. మరో అయిదు నిమిషాలకు బాత్ రూమ్ తలుపు గడియవేసుకుని అభ్యంగ స్నాన మాచరిస్తున్నాను. షాంపుతో పోసుకోవ టం నాకు నచ్చదు. సీకాయకూడా యిష్ట ముండదు. కుంకుడుకాయ రసంతోనే నాకు నేనే పులుసు పోసుకుని స్నానం చేస్తున్నాను.

"అమ్మగారూ!" అంది పార్వతి బయటినుంచి.

"ఏమిటి?" అన్నాను విసుగ్గా.

"అయ్యగా రెలావుంటారు? మీలాగా పచ్చగా, అందంగా వుంటారా?"

"నే నందంగా వుంటానా? అ విష యం నాకు తెలీదుగాని అయ్యగారు మట్టుకు ఎర్రగా, పొడుగ్గా చాలా అందంగా వుంటారు. అదెంత అందమంటే ఒకసారి చూశామంటే జీవితాంతం ఎవరూ మరిచిపోలేరు. మధుర స్వప్నాలూ తప్పవు" పార్వతి ఎదురుగా వుంటే ఆ మాటలు మాట్లాడలేకపోయే దాన్ని. తలుపడ్డముంది కాబట్టి ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది.

పార్వతి గలగల నవ్విన ధ్వని. "అయితే ఒక్క మాటంటా, కోప్పడకండమ్మ గారూ! అయ్యగారే యిక్కడుంటే మీకు సవతులపోరు తప్పేది కాదన్నమాట".

"ఛీ పోవే. అయినా స్నానం చేస్తు న్నప్పుడు మాట్లాడించకు. నాకు బావుండ దని చాలాసార్లు చెప్పాను."

పార్వతి మరి మాట్లాడలేదు. అప్పు డప్పు డామె గాజుల చప్పుడూ, అడుగుల కదలికా వినిపిస్తున్నాయి.

నాకూ యిలాంటి సన్నివేశా లుంటా యనీ, ఒక వనిమనిషికి యింత చిలిపిగా మాట్లాడే చనువు యిచ్చివుంటానని బయట నన్ను చూస్తే ఎవరూ అనుకోరు. అనుభూతు లెరుగని మొండి ప్రాణిని, చల నంలేని రాతిగోడను చాలామంది దృష్టిలో నేను.

స్నానం చేసేటప్పుడు ఓ మధుర ఏకాంత భావముంటుంది. ఆలోచనలు హాయిగా, పిల్ల తెమ్మెరల్లా సాగుతుంటాయి. అప్పుడు మరో మనిషి జోక్యం, కనీసం దగ్గర్లో మరో మనిషి మసులుతున్నాడనే తలపు ప్రాణాంతకంగా వుంటుంది. ఆ స్థితిలో ఎవరితోనైనా మాట్లాడాలంటే చెప్పలేని ఎలర్జీగా వుంటుంది.

ఎంత ఆధునిక సౌకర్యాలతో అమర్చు కున్నా ఎటాచడ్ బాత్‌రూమ్సు అవి నా కిష్టముండదు. అందుకని బాత్‌రూమ్ పెరట్లోనే దూరంగా కట్టించుకున్నాను. చీరె చుట్ట బెట్టుకుని, తలుపు తెరిచి గబగబ లోపలకు పరిగెత్తాను. పార్వతి కళ్ళప్ప గించి నావంక చూస్తూ వుండటం నాకళ్ళ బడకపోలేదు.

బెడ్‌రూమ్‌లో తలుపులు వేసుకుని, నా కిష్టమైన లేత ఆకుపచ్చరంగు వెంకట గిరి నేతచీరె కట్టుకున్నాను. దానిమీద కనకాంబరంరంగు రవిక తొడుక్కుని కిటికీముందు నిల్చుని తలచిక్కు విడదీసు

కుంటున్నాను. కిటికీగుండా తెల్లని వెలుగు లోపలకు పడుతున్నది.

ఇంతలో ద్వారం బయటనుండి తలుపు తట్టి "అమ్మగారూ" అని పిలిచింది.

నేను కొమ్ముదువ్వెనతో చిక్కు విడ దీసుకుంటూ "ఎందుకూ ?" అన్నాను.

"తలుపుతియ్యండి చెబుతాను."

ఒక్కక్షణం ఊరుకోదుగదా అను కుంటూ వెళ్ళి తలుపు తెరిచాను. పార్వతి గుమ్మం అవతల ఒకచేతిలో నిప్పులున్న యినుపగరిటెతోనూ, మరోచేతిలో సాంబ్రాణి డబ్బా పట్టుకుని నిలబడివుంది. ఆకుపచ్చ, ఎరుపుమధ్య యిరుక్కున్న నన్ను తన పెద్దకళ్ళను మరింత విశాలం చేసి వింతగా చూసింది.

"అలా చూడకు," అన్నాను.

"సాంబ్రాణీపొగ వేద్దామని వచ్చా నమ్మగారూ. మీరు మంచంవార పడు కోండి. నేను చక్కా పొగవేస్తాను."

"అబ్బ ! ఎందుకే యీ గొడవంతా?"

"కాదులెం డమ్మగారూ ! తలంటు కున్నాక పొగేసుకోకపోతే ఏం బాగుం టుంది ? మీరు పడుకోండి చెబుతాను," అని బలవంతంచేసింది.

తనమాట కాదనలేక వెళ్ళి పందిరి మంచంమీద జుట్టు నేలమీదకు జారాడే టట్లు పడుకున్నాను.

పార్వతి సాంబ్రాణి నిప్పులుమీదజల్లి, పొగ వలయాలుగా పైకి లేస్తూండగా "అబ్బ ! ఎంత పెద్ద జుట్టమ్మగారు మీది ? మిమ్మల్నిచూసి మేము సిగ్గుపడాలి," అంది.

"అదిసరేగాని, జాగ్రత్తకబుర్లాడుతూ నా జుట్టు కాల్చగలవు."

"అదేమి టమ్మగారూ, యిందులో ఒక్క వెంట్రుకకాలితే నా ప్రాణం పోదూ ?''

కమ్మని వాసనలు వెదజల్లుతూ సాంబ్రాణిపొగ సుడులు సుడులుగా పైకి లేస్తుంది. జుట్టులోంచి, చెవులప్రక్క



నుండి, కళ్ళముందుగా సుళ్ళు తిరుగు తోంది వెచ్చనిపొగ.

పార్వతి ఏదో చెబుతోంది. నాకు సరిగ్గా వినబడటంలేదు. ఎక్కడో వుంది నామనస్సు. ఎవరో విహరిస్తున్నారు అందులో.

కళ్ళు మత్తుగా, హాయిగా మూతలు పడుతున్నాయి.

ఎవరిదోరూపం, ఏనాటిదో దృశ్యం మూతలుపడే కనులముందు కదులాడు తోంది.

"అమ్మగారూ! అమ్మగారూ!" అని చాలా సేపటికి పార్వతికంఠం. నేను పలకలేదు. పలకాలనిపించలేదు.

"పడుకుంటున్నారా? పడుకోండి. రాత్రంతా నిద్రపట్టివుండదు" పార్వతి లేచి వెళ్ళిపోతున్న చప్పుడు. అంతా ఏదోగావుంది.

వెచ్చటిపొగ! వెచ్చటిజీవితం!! వెచ్చని కన్నీరు!!!

వెనక్కి ప్రవహించే సెలయేరు...!

* * *

మా పల్లెటూరి పెంకుటింట్లో, పాతకాలంనాటి పడకగదిలో, చాదస్తంగా అలంకరించబడ్డ పందిరిమంచం ప్రక్కన, హరికెన్ దీపకాంతిలో, భయపడినట్లు, కుచించుకుపోయినట్లు నిలబడివున్న నా దగ్గరకు మహారాజులా నడిచివచ్చాడు సుందరంబావ.

"తలఎత్తు."

ఆయన ఆజ్ఞను శిరసావహిస్తున్నట్లు సిగ్గుని ప్రక్కకినెట్టుతూ, ఎర్రబడ్డముఖాన్ని బలవంతంగా పైకెత్తాను,

ఉన్నతంగా, ఠీవిగా, అందంగా వున్నాడు సుందరంబావ. సున్నితంగా, సొగసుగా, వయ్యారంగా లేడని అప్పుడనుకోలేదు. రెప్పవాల్చకుండా నావైపు చూస్తున్నాడు.

నేనూ చూశాను ఆయన కళ్ళలోకి, ధైర్యంతెచ్చుకుని. ఇద్దరికళ్ళూ కలుసుకున్నాయి. ఇద్దరిచూపులూ ఢీకొన్నాయి.

ఈయన నా సుందరంబావ, చిన్నప్పటినుంచీ నేనెరిగివున్నా నాతో ముభావంగావుంటూ, దాగుడుమూతలాడుతూ నన్ను కదిలించిన బావ.

ఆయనలో ఏముంది?

బోలెడువుంది. ప్రపంచమంతా గాలించినా అంత గొప్ప భర్త దొరుకుతాడా అనిపించింది. 'గొప్ప' అంటే ఏమిటో ఆ క్షణంలో నాకు నిర్వచనం తెలియదు. అది నాకు నేనే సృష్టించుకున్న గొప్ప.

ఇంత సుకుమారిని నేను, ఆ చేతులు నన్ను తట్టుతుంటె తట్టుకోగలనా అని తలపోస్తుంటే "శకుంతలా!" అని పిలిచాడు.

ఆ పిలుపు వేయికోకిలలు కూసినట్లు లేదు. వేయిసూర్యులు చురుక్కుమనిపించినట్లువుంది.

కళ్ళతోనే జవాబిచ్చాను.

"నువ్వు నా మరదలివి. అయినా నేనెప్పుడూ నీతో బావగా వ్యవహరించలేదు. ఉండతగని బావని కాదుకదూ."

"ఆఁ అలా ఏంకాదు." అని చెప్పాలనిపించింది. "మాట్లాడకపోతేనేం? నీ ఊహే ఓ ముత్యాల కావ్యం" అని ఎలుగెత్తి చాటాలనిపించింది.

"జవాబు చెప్పలేవు. నీకు సిగ్గు. ఇంత దుర్మార్గుడైన బావను నీసిగ్గు ఏవిధంగానూ కదిలించలేదని తెలుసుకో."

ఆమాటలు వింటూంటే భయంవేసింది. అయినా పెదవులమీదకు చిరునవ్వు తెచ్చుకునేందుకు ప్రయత్నించాను.

"అలా మంచంమీద కూర్చుని మాట్లాడుకుందాంరా. నీతో ఎన్నో మాట్లాడాలి," అన్నాడు మళ్ళీ సుందరంబావ.

"ఫర్వాలేదు నిలబడే వుంటాను చెప్పండి" అన్నానెలాగో ధైర్యంతెచ్చుకుని.

"ఉహు, అలా కాదు," అని బలవంతపెట్టి నేను పందిరిమంచంమీద కూర్చునేటట్లు చేశాడు. ఇటుచివర నేనూ, అటుచివర ఆయనా కూర్చున్నాం.

"శకుంతలా!" అని గంభీరంగా మొదలుపెట్టాడాయన. "నేను చెప్పబోయే విషయాలు నీ కేమాత్రం రుచించవు. ఎన్నో ఆశలతో, కాంక్షలతో యీ దాంపత్య జీవితాన్నిగురించి ఊహించి వుంటావు. అవి అన్నీ వొట్టి కలలేననీ, తెలుసుకున్నప్పుడు నువ్వెట్లా చలించిపోతావో తలుచుకుంటే భయంగావుంది."

నాగుండె గబగబ కొట్టుకుంది. వంట్లో రక్తప్రసార. మెక్కువయింది దీపకాంతిలో తెల్లగా మెరిసే గోడవైపు చూపునిల్పి ఆయనవైపు చెవులప్పగించాను.

"శకుంతలా! నాన్నని చిన్నప్పుడే కోల్పోయాను. పదవపడన్నా నిండకుండానే అమ్మనుకోల్పోయాను. అప్పటినుంచీ నిన్నమొన్నటివరకూ నా బ్రతుకంతా హాస్టళ్ళలోనే గడిచింది. పదేళ్ళవయస్సులోనే యింటికి దూరంగా వుండటం నేర్చుకుని, హాస్టళ్ళలో చాపమీద పడుకుని కాలం గడపటం, సయించకపోయినా రెండుపూటలా వాళ్ళు పడేసే నాలుగుమెతుకులూ తినటం, తెల్లవారుఝామున నాలుగింటికే నిద్రలేవటం, చన్నీళ్ళస్నానం, కంచాలు కడుక్కోవటం, చిరిగినబట్టలు కుట్టుకోవటం, అప్పుడప్పుడు బడిపంతుళ్ళచేత చచ్చేటట్లు దెబ్బలుతినటం – యివన్నీ అలవాటయిపోయి, జీవితసుఖాలపట్ల వ్యామోహం చచ్చిపోయింది. కష్టాలలోనే మాధుర్యం చూడటం నేర్చుకున్నాను.

"వీటిమధ్య ఉపశాంతి లభించాలంటే చదవాలి. చదివితేతప్ప ముక్తిలేదు. విపరీతంగా చదవటం మొదలుపెట్టాను. చేతికి అందిన పుస్తకమల్లా చదివాను. ఎప్పుడూ చదువు. చదువు. మరోధ్యాస లేదు. హరికెన్ లాంతరు ముందుపెట్టుకుని, నిద్రాహారాలుమాని పిచ్చిగా, చూసేవాళ్ళకు భయంవేసేటట్లు చదివాను.

"ఆటపాటల్లో అభిరుచిలేదు. అక్కడి నిబంధనల ప్రకారం అప్పుడప్పుడు ఆటపాటల్లో పాల్గొనవలసివచ్చినా, మొక్కుబడి తీర్చుకున్నట్లే వుండేదిగాని, ఒక్కటీ నాకు అబ్బలేదు. ఒక్క స్నేహితుడుండేవాడుకాదు. స్నేహాలు పెంచుకోవాలనీ, యితరులతో కాలక్షేపం చెయ్యాలనీ అభిరుచే వుండేదికాదు.

"నేను చదువు మొదలుపెట్టిన మొదటి

సంవత్సరంనుంచీ ప్రతి క్లాసులోనూ ఫస్టు మార్కులే. ఎప్పుడూ స్కాలర్ షిప్ తోనే చదివాను.

"అయితేనేం చదువు నిమిత్తం, నా ఖర్చుల నిమిత్తం పైన ఎంతో డబ్బు అవసరమయేది, అదంతా మామయ్యే సర్దేవాడు. మామయ్యనా పాలి దేముడుగా అయాడు. నన్నెంతో ఆదరంగా చూసి చదువు చెప్పించాడు.

"ఆయన సహాయ, సానుభూతులతోనే నేను యీనాటికి ఎమ్. బి. బి. ఎస్. పూర్తిచేసి డాక్టర్ని కాగలిగాను. ఆయన ఋణం నే నెన్నటికీ తీర్చుకోలేను.

"అందుకే మామయ్య నాదగ్గరకొచ్చి 'శకుంతలని నీకిచ్చి చేద్దామని నిశ్చయించాను. ఏమంటావు?' అని వెల్లడించినప్పుడు నిరుత్తరుడినై ఏ మాటా బయటకు చెప్పలేని అశక్తుడనయ్యాను. నా మౌనం అంగీకారంగా తీసుకుని ఆయన వెళ్ళిపోయాడు. బహుశా ఆయన వల్ల అంత ఉపకారంపొందిన నాలో ఏమాత్రం కృతఘ్నతా ఆయన్లోని మానవత్వం ఊహించి వుండదు.

"నేను నిర్ఘాంతపోయి మిగిలిపోయాను. పెళ్ళి, ప్రేమ, బంధం - వీటిని గురించి అంతవరకూ కలలోనైనా ఆలోచించి వుండలేదు. ఒక స్త్రీకి భర్తగా నాకంటే పనికిమాలిన వ్యక్తి ప్రపంచంలో వుండడు. ఎంతో రీసెర్చి చేద్దామని, నా జీవితమంతా విజ్ఞానార్జనకు, సమున్నత ఆశయాలకు ధారపోద్దామని కంకణం కట్టుకుని కూర్చున్న వ్యక్తిని నాకు పెళ్ళేమిటి?

"నేనో అనుభూతు లెరుగని మొండి మనిషిని. ఉవ్వెత్తుగా లేచే మంటను, చిత్రమైన ప్రళయాన్ని. నాకు పెళ్ళేమిటి?

"నా అర్ధాంగిగా మారిన వనితకు బ్రతుకు బండలు కాదా?

ఇట్లా నేను ఏది తేల్చుకోలేక పతమతమవుతూ వుండగానే పుణ్యకాలం కాస్తా




గడిచిపోయింది. ముహూర్తం సమీపించింది. మామయ్య వచ్చి నన్ను తీసుకు వెళ్ళి పెళ్ళిబట్టలు తొడిగి పెళ్ళికొడుకుని చేసేశాడు.

"భజంత్రీలు చెవుల్లో మార్మోగుతున్నాయి.

"అవు ననలేను. కా దనలేను. 'నాకి పెళ్ళి యిష్టంలేదు,' అని ఎలుగెత్తి చాటాలనుకున్నాను. గొంతెవరో నొక్కేసినట్లయింది. పెళ్ళిపందిరి. చుట్టాలు. మంత్రాలు చదివే పురోహితులు, భజంత్రీలు. నేను పట్టుకున్న మంగళసూత్రం, మూడు ముళ్ళు ... అంతా కలగా జరిగిపోయింది.

"ఏంచెయ్యను? నువ్వు చెప్పు శకుంతలా! ఏంచెయ్యను? ఇప్పుడంతా అంధకారం కళ్ళముందు. నాకేది గమ్యం?"

భోరున ఏడ్చేద్దామనిపించింది. ఇందుకా నేను పెళ్ళిచేసుకుంది? ఈ విషాద చరిత్ర ఆలకించటానికా?

జీవితమంతా నాశనమైపోయినట్లు, సర్వం అంధకారబంధుర మైపోయినట్లు ఆయన మాట్లాడుతూంటే భూమిలోకి కృంగిపోయినట్లనిపించింది.

కళ్ళలోంచి నీళ్ళు జలజలా కారాయి. సిగ్గుతెరలన్నీ చించివేసి ఆయనవంక తిరిగాను. వేయి సమస్యలు పీడించినట్లు వాడిపోయి వుంది ఆయన ముఖం.

ఆయన వెనకగా గోడనున్న అద్దంలో నా ప్రతిబింబం కనిపించి, నవ్వినట్లయింది. బుజంమీదనుంచి ముందుకుపడి వక్షస్థలం మీద నిలచిన నా పూలజడ నన్నుచూసి నవ్వినట్లయింది. అవును, నా కాటుక రేఖలూ, బుగ్గన చుక్కా, లేత బుజాల మీద జారేపమిటా అన్నీ నన్నుచూసి నవ్వాయి.

నేనుమాత్రం ఏడుస్తున్నాను.

ఎలాగో గొంతు స్వాధీనంలోకి తెచ్చుకుని "మీ ఆదర్శాలకు, ఆశయాలకు నేనెన్నడూ అడ్డురాను. మీ వేదన అర్థం చేసుకున్నాను. ఇందులో మీ తప్పు ఏమీ లేదు. మీ మంచితనం మిమ్మల్ని వంచించింది. కాని యిప్పుడు సమయం మించిపోయింది. నన్ను మీకు అంటగట్టేశారు. నాకు చదువులేదు. నిజమే. కాని, ఏ పరిస్థితుల్లోనయినా సరిపెట్టుకుపోయే గుణం వుంది. అప్సరసను కాదు. కాని కురూపిని మాత్రం కాదు. దయచేసి మీ భావనా ప్రపంచాన్ని ఎవరూ అర్థం చేసుకోనంతటి అతీతంగా సృష్టించకండి. నలుగురిలోనూ వెల్తిగా జీవించేదశ నాకు కలుగనీయ

కండి. మీ దారికి ఎప్పుడూ అడ్డురాను. ఎప్పుడూ ఏమీ ప్రశ్నించను. కాని నన్ను మాత్రం మీతోనే వుండనివ్వండి. మీరు నా భర్తగా వ్యవహారించ నక్కర్లేదు. కనబడండి," అని వేడుకున్నాను.

ఇంతకూ అప్పుడు నాకు పట్టుమని పదహారేళ్లు లేవు. ఆ వయస్సులో అంతంత పెద్దమాటలు ఎలా మాట్లాడగలిగానో నా కిప్పటికీ అర్థంకాదు.

"కాని ఎలా? ఏ సుఖం కోసం? స్వరూపంలేని ఈ దాంపత్యం నీకే విధంగా సాయపడుతుంది?"

"నేను మీ పత్నిని. మిమ్మల్ని ప్రేమించానని తెలియదా?" అని గట్టిగా అడుగుదా మనుకున్నాను.

కాని అడుదలేకపోయాను. "నాకు స్వరూపం వద్దు. స్వరూప భ్రాంతి చాలు" అని మాత్రం అనగలిగాను.

"కాని చూడు శకుంతలా! నే నెవరికీ చెందని పరదేశిని. ప్రపంచం యీనాటికీ సమాధానం చెప్పలేని అనేక రోగాలకూ పరిష్కార మార్గం ఆలోచించడంలోనే నా జీవితంలో ప్రతిక్షణమూ వెచ్చిస్తాను. నిన్న నే అమెరికానుంచి వర్తమానంకూడా వచ్చింది. లిడర్లీ కంపెనీ నన్ను ఉపయోగించుకోవటానికి సిద్ధంగా వుంది."

మిన్ను విరిగి మీదపడినట్లయింది. "అయితే మీరు విదేశాలకు వెళ్ళి పోతారా?" అనడిగాను విహ్వాలురాలినై పోయి.

"అవును," అన్నాడు దృఢస్వరంతో.

"నన్ను తీసుకువెళ్ళండి. ఏ విధంగానైనా మీకు ఉపయోగపడుతానన్న ధైర్యం వుంది."

"ఊహు నా వెంట ఎవరూ రావటానికి వీల్లేదు."

"నా మాట వినండి. నేను మీ వెంట వుంటే యిక్కడెవరూ ఏ వ్యాఖ్యానమూ చేయటానికి వీలుండదు."

ఆకస్మికంగా ఆయన ముఖంలో కోపం అవతరించింది. కంఠంలోకూడా కాఠిన్యం ధ్వనించింది. "నేనెవర్నీ భరించలేను అని చెబుతూంటే వినిపించుకోవేం?"

కళ్ళముందు ఏవో చక్రాలు గిరగిర తిరిగాయి. చెవులకు రకరకాల శబ్దాలు వినిపిస్తున్నాయి. నా శరీరం గాలిలో తేలిపోతున్నట్లు అనిపించింది. సాయం కోసం చెయ్యి జాచేసరికి చేతికి దుప్పటి తగిలింది. దుప్పటిని వ్రేళ్ళతో పట్టుకుని లాగాను. తర్వాత క్రిందికి తూలిపడటం గుర్తువుంది.

కళ్లు తెరిచేసరికి పందిరిమంచంమీద పడుకుని వున్నాను. ఆయన నా చెయ్యి పట్టుకుని నాడి చూస్తున్నారు.

"పరదేశీ!" అన్నాను అప్రయత్నంగా హీనస్వరంతో. "మీరు వెళ్ళిపోండి. మీరు పరదేశంలో వున్న నా పతి అని జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను."

తర్వాత కొద్దిరోజుల్లోనే యింట్లో ఈ విషయం వెల్లడైపోయింది. ఆయనకు వీసాకూడా వచ్చేసింది. ఇంట్లో పెద్ద అలజడి చెలరేగింది, అమ్మ శోకాలు తీస్తూ కూర్చుంది. "ఒక్కగా నొక్క కూతురు కళ్ళెదురుగుండా వుంచుకుని అచ్చటా ముచ్చటా తీర్చుకోవాలని ఆశిస్తే యిలా చేశావుటయ్యా" అంటూ ఘోషపెట్టింది.

"నువ్వు చేసుకున్న తీర్మానం నా కేం నచ్చలేదయ్యా," అన్నాడు నాన్న గంభీరంగా.

అయినా ఆయన పట్టు అణుమాత్రమైనా సడలలేదు.

అంతాకలసి నన్ను ఆయనమీద దెబ్బలాడమని పురిగొల్పటానికి ప్రయత్నించారు. నేను మౌనంగా ఊరుకునేసరికి వాళ్ళకు ఏమీ అర్థంగాక నెత్తిబాదుకున్నారు. "నువ్వు వుత్త వాజెమ్మవు" అని నన్ను నిందించారు.

నేను పెదవి కదపలేదు.

రోజులతరబడి యింట్లో యుద్ధవాతావరణం ఏర్పడింది. ఏడుపులు, మొత్తుకోళ్లు అరుపులు, కేకలు, పెడబొబ్బలు, ప్రకర్షలు... వీటన్నిటినీ అవలీలగా అవతలకు నెట్టి ఆయన చిరునవ్వుతో ప్రయాణమై వెళ్ళిపోయారు.

వెళ్లేముందు గదిలోకి చాటుగా పిలిచాను. ఇద్దరమే వున్నాం లోపల. తలుపులు మూశాను.

"ఒక్కసారి మీకు పాదాభివందనం చేస్తాను. పాదధూళి స్వీకరిస్తాను" అన్నాను, డగ్గుత్తికతో.

"ఎందుకు? అదేం తృప్తి నీకు?"

"అవన్నీ అడక్కండి. పెళ్ళయాక యిలా జరగాలని నేనాశించిన స్వప్నాలలో యిదికూడా ఒకటి."

"నీ యిష్టం."

"వొంగి ఆయన పాదాలను తాకి ఆ చేతులను శిరస్సుకు రాచుకున్నాను. ఆయన ఒక్కనిముషం మౌనంగా నిలబడి, తర్వాత తలుపులు తెరుచుకుని నిశ్శబ్దంగా బయటకు వెళ్ళిపోయారు,

ఆయన ఆత్మవిశ్వాసానికి నేను అచ్చెరువొందాను. అభినందించాను. ఆరాధించాను.

మిగతా విషయాలు నాకు తెలియవుగాని, ఒకందుకు ఆయన అదృష్టవంతులు నాలాంటి అచంచలంగా ప్రేమించే భార్య దొరికినందుకు.

ఆయన వెళ్ళిపోయారు. అప్పుడే, ఆ క్షణంలోనే నేను భవిష్యత్ నిర్ణయించుకున్నాను.

"నేను చదువుతాను" అన్నాను.

"ఇప్పుడు నీకు చదువేమిటే?" అని విస్తుపోయారు మావాళ్లు. అప్పటికి నేను పుస్తకం పట్టుకుని నాలుగేళ్ళయింది థర్డుఫారం తప్పి చదువుకు స్వస్తిచెప్పానాయె.

"అదంతా నాకు తెలీదు. నేను చదువుతాను" అన్నాను మొండిగా.

చదవటం మొదలుపెట్టాను. రెండేళ్లు గడిచాయి. నేను మెట్రిక్ ప్యాసయ్యాను అక్కడికి వెళ్ళాక ఆయన నాకు ఉత్తరం రాయలేదు; నేనంతకంటే రాయలేదు. నాన్నమాత్రం చాలసార్లు రాశారు 'ఎప్పుడొస్తావు? లేకపోతే ఎప్పుడు తీసుకెడతా' వని.

చివరకు జవాబు వచ్చింది, "నేను యిప్పట్లో రావటమనేది కల్ల. అసలు వస్తానో రానోకూడా తెలియదు. నేనిక్కడ మహాయజ్ఞం చేస్తున్నాను. ఆ యజ్ఞ ఫలితం ఎలా వుంటుందో తెలియదు. కొద్దిరోజుల్లో నే మీకు డబ్బు పంపిస్తున్నాను. మీరు నాకు చేసిన ఉపకారానికి బదులు తీర్చుకుంటున్నా నని కాదు. అది ఎప్పటికీ తీర్చుకోలేను. మీ అమ్మాయికి నేను తగిన వరుడ్ని కాదు. దయవుంచి ఆమెకు వేరొక వ్యక్తిని యిచ్చి వివాహం జరిపించండి," అని.

ఆ వుత్తరంచూసి మా నాన్న చిందులు తొక్కారు. "విశ్వాసఘాతకుడు; తిన్న లుంటివాసాలు లెక్కపెట్టే కృతఘ్నుడు. డబ్బు పంపిస్తాడట – వీడి ముష్టి డబ్బు కోసం మన మిక్కడ మొహం వాచినా మనుకుంటున్నాడా! అమ్మడూ! నివ్వేం భయపడకు. నీ జీవితం యింతటితో ఏమీ ఆగిపోలేదు. కోర్టుకెక్కి మూడు నిమిషాల్లో వీడినుంచి విడాకు లొచ్చేటట్లుగా చూస్తాను. ఆ దౌర్భాగ్యుడ్నింక మరిచిపో. వాడు నీ మొగుడు కాదనుకో. పండువంటి నీ జీవితాన్ని పాడుచేసేటంతటి ఖైతు కాదమ్మా నీతండ్రి. నీకు మళ్ళీ పెళ్ళిచేసి, నువ్వు యింట్లో కలకల్లాడుతూ తిరుగుతూంటే ..."

"నాన్నా !" అని అరిచాను గట్టిగా.

ఆయన అదిరిపడి నావంక విస్మయంగా చూశారు.

నేను వెంటనే అవేశాన్ని నిగ్రహించుకుని "పండువంటి జీవితం పాడుకాకుండా వుండాలంటే మళ్ళీపెళ్ళి చేసుకోవట మొక్కటే శరణ్యం కాదు నాన్నా! ఆయన తిరిగిరాడని మీ కాలశ్యంగా తెలిసిందిగాని నాకు ఎప్పుడో తెలుసు నాన్నా. ఆయనకు నేను అక్కర్లేకపోతే నాకెవరూ వద్దు నాన్నా. నా భవిష్యత్తుని నేను తుణ్ణంగా నిర్ణయించుకున్నాను. నేను చదువుకు ుటాను. దయవుంచి మీ రెవరూ మీ నిర్ణయాలను నామీద రుద్దటానికి ప్రయత్నించకండి," అని అక్కడ్నుంచి వెళ్ళబోతూ "ఆయన డబ్బుమాత్రం చిల్లిగవ్వ మన కవసరం లేదు నాన్నా ! ఆ విషయంమాత్రం స్పష్టంగా తెలియజేయండి," అన్నాను.

తర్వాత కాలేజీలో జేరాను. ఇంటర్మీడియట్ అయిపోయాక ఎమ్. బి. బి. ఎస్ కోర్సులో ప్రవేశించాను. అది అయిపోయింది. ఎమ్. డి. గైనిక్‌లో చేరాను.

రోజులు తిరిగిపోతున్నాయి. నిత్యం వారిని స్మరిస్తూనేవున్నాను. నా గొప్పతనమనీ, త్యాగమనీ చెప్పుకోనుగాని, వారియందు నాకు వున్న ఆరాధనాభావం ఏనాటికీ చెరిగిపోలేదు. వారిని నేను మరిచిపోదామని ప్రయత్నించలేదు, మరిచిపోలేదు. పైపెచ్చు ప్రేమించాను, పూజించాను.

ఈ వ్యామోహానికి కారణ మేమిటో తెలియదు. ఈ మోహబంధం త్రుంచివేయటానికి ఎన్నోపరిస్థితులు సృష్టించబడ్డాయిగాని, వాటి నన్నిటినీ ఎదుర్కున్నాన ధైర్యంగా. ఎన్నో విపత్కర పరిస్థితుల ఎదురయ్యాయి. నాలో నిద్రాణమైవున్న వాంఛల్ని రెచ్చకొట్టటానికీ, నన్ను సాధించి తమవైపు త్రిప్పుకోవటాని ఎన్నో ప్రయత్నాలు జరిగాయి.

నేను చెక్కుచెదరలేదు.

ప్రేమించమనీ, పెళ్ళి చేసుకోమ ఎందరో డాక్టర్ల దగ్గరనుంచి, ప్రము వ్యక్తుల దగ్గర్నుంచి అభ్యర్థనలు. అన్నీ చిరునవ్వుతో తిరస్కరించాను.


నేను చదివాను. ఎమ్. డి. ప్యా యయ్యాను. పదహారేళ్ళవయ సొచ్చేవరకు కలనైనా తలఛని జీవిత పరిణామాని సాధించాను.

ఇదంతా ఎందుకు? ఎవరికోసం? అం నతో పోటీపడటం కోసంకాదు. నేన గొప్పదాన్నే అని నిరూపించుట కో కాదు. ఆయన సానుభూతీ, ప్రేమా పొం టము కోసంకాదు.

ఓ అర్థంలేని వెలుగేదో నాకం కనిపించింది. ఆ వెలుగులో అర్థంలేకుం నేనూ తళుక్కుమన్నాను.

* * *

"అమ్మగారూ! ఎప్పుడూ లేం యివాళ యింత సేపు పడుకున్నా రేమి



వేళగానివేళ; చెయ్యాల్సిన పనులన్నీ అలానే వుండిపోయాయి. లేవం డమ్మ గారూ!"

పార్వతి కేకలు విని, ఉలికిపడి కళ్ళు తెరిచాను. ఎంతో పొద్దుపోయినట్లు అని ంచింది. వేయికళ్ళు తెరుచుకుని, ఎదురు చూడాల్సినరోజు, యీ మైకమేమిటో నాకు?

గబగబ లేచి యివతలకు వచ్చాను. పార్వతి ఎదురుగా కనబడి ముసిముసిగా వ్వింది.

"నవ్వు లింక చాలించి, గబగబ పని చూడు. జున్ను తయారయింది. కూరలు రిగావా? బియ్యంలో రాళ్ళు ఏరావా?" ంటూ అజమాయిషీ చేశాను.

అపూట ఏంతిన్నానో, ఏం తినలేదో నాకు తెలియదు. సాయంత్రం అయిదు ంటలకు వా రొస్తారు. అందుకని పార్వతీ, నూ చేసినపని చెయ్యకుండా చేశాము. ల్లంతా కడిగాము; శుభ్రంచేశాము. మానులన్నీ అందంగా సర్దాము. గోడల న్న బూజులు దులిపాము. ఇంటిని ద్దంలా తయారు చేశాము.

రకరకాల పిండివంటలు తయారు శాను. రసగుల్లా, రవ్వకేసరీ, సేమ్యా, లిహోరా, ఆవడా అన్నీ చేశాను.

ఈ పనులన్నీ పూర్తయేసరికి మూడ యింది. అప్పుడు పార్వతి బలవంతంమీద రోమారు స్నానం చేశాక, తను సెలక్ట్ సిన బీరాకురంగు చీరె ధరించాను. తనే లకి నూనె రాచి, జుట్టు దువ్వి, ముడి సింది. జుట్టు ముడివేయటంలో పార్వతి స్తహస్తురాలు.

నుదుట బొట్టు దిద్దుకుందామని నిలువు ద్దంలోకి చూసుకున్నాను. నా ప్రతి బింబం కనిపించింది. రోజూ చూసుకునే పమే. అయినా కొత్తగా, కొట్టచ్చి ట్లుగా కనిపించింది.

"శకుంతలా!" అని చెవిలో ఎవరో చినట్లుయింది.

ఉలికిపడి, గభాలున ప్రక్కకి తిరిగి పోయాను.

నాలుగున్నరకల్లా, తలుపు తాళం వేసుకుని బయటకు వచ్చాము. డ్రైవరు కారు గేటువైపు త్రిప్పి సిద్ధంగావున్నాడు. నేనూ, పార్వతీ వెళ్ళి కార్లోకూర్చున్నాము. కారు కదిలింది.

ప్లాట్ ఫారంమీద జనం సందడిగా, హడావుడిగా వున్నారు. రణగొణధ్వనిగా వుంది. నేను ఒకప్రక్కన నిలబడి, చేతులు కట్టుకుని, అప్పుడప్పుడూ చిన్నచిన్న అడుగులతో అటూయిటూ పచార్లు చేస్తూన్నాను. పార్వతి మధ్యమధ్య ఏదోమాట అని నవ్వుతోంది.

గంట కొట్టారు.

నాగుండె గణగణమంది.

రెక్క వాలింది.

నా తనువే వాలినట్లయింది.

ఎవరో ప్రశ్నిస్తున్నారు: "శకుంతలా! నువ్వు జీవితంలో ఏమి సుఖానికి నోచుకున్నావు? నీ విద్యా, వినయం, విజ్ఞానం, అందం, సంపదాఅన్నీ అడవిగాచిన వెన్నెల అయినాయి. నీకు నువ్వు గొప్ప అనుకుంటున్నావేమోగాని, నీ బ్రతుకు కొక స్వరూపంలేదు; స్పష్టతలేదు; నిర్వచనం లేదు. నీ ఆరాధన మూర్ఖం; అని గుర్తించ లేదా?"

"గుర్తించను," అనుకున్నాను మొండిగా. "నాకు యిదే ఆనందం, ఇదే మనశ్శాంతి. ఇదే నాకు మహావెలుగు. నా ప్రేమ వున్నతమైనది. నా ఆరాధన సాటిలేనిది. వాటితో పునీతనమైనాయి మా జన్మలు.

దూరంగా కూత వినిపించింది. గుండె దడదడమని కొట్టుకుంది. వచ్చేస్తున్నది రైలు. దూరంగా కనిపించి, అంతలోనే ప్లాట్ ఫారంమీదకు వచ్చేసి అగుతున్నది. మూర్ఛపోతానేమో ననిపించింది. ప్రక్కనున్న పార్వతి చెయ్యి గట్టిగా పట్టుకున్నాను.

"అలా నిల్చుంటారేం అమ్మగారూ! అయ్యగారు ఏ పెట్టెలో వున్నారో వెదక వద్దూ? పదండి," అన్న పార్వతి గొంతు వినిపించింది.

నేను తృళ్ళిపడి, యీ ప్రపంచంలోకి వచ్చి "పద," అని బయల్దేరాను కంగారుగా.

నా కళ్లు అత్యంతాతురతతో అన్ని పెట్టెలూ గాలిస్తున్నాయి. ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులు వరుసగా మూడు నాలుగున్నాయి. జనం ఎక్కుతున్నారు, దిగుతున్నారు.

ఉన్నట్లుండి ఓ కంపార్టుమెంటు గుమ్మం దగ్గిర బుజంక్రింద కర్ర ఆసరాగా చేసుకుని ఒక చేత్తో కమ్మీని ఆధారంగా చేసుకుని నిలబడ్డ ఆకారం ప్రత్యక్షమయింది.

ఒక కాలు సగంవరకూ కోల్పోయినా దబ్బపండువంటి శరీరచ్ఛాయతో అందంగా ఉన్నతంగా వుండా ఆకారం.

"అదిగో. వారు వచ్చేశారు. వారు వచ్చేశారు," అని అరిచి అటువైపు పరిగెత్తాను. వగర్పుకూడా వచ్చింది.


ప్లాటుఫారంమీద మనుషుల్ని తోసుకుంటూ ముందుకు వెళ్ళి కంపార్టుమెంటును సమీపించాను. "ఏమండీ!" అని పిలిచాను, ఆనందోద్రేకాలతో.

ఆయన నా వంక తిరిగారు. మా ఇద్దరి చూపులూ కలిశాయి. నా వళ్లు ఝల్లుమంది.

నా స్వామి; నా ప్రభువు; నారాజా; యిన్నాళ్ళకు నామొర వినబడి వచ్చారు. ఈ శుభఘడియకోసమే ఇన్నాళ్లూ బ్రతికి వున్నాననిపించింది.

"శకుంతలా!" అని పిలిచారు.

ఎంత మృదువుగా, మార్దవంగా వుందనీ ఆ పిలుపు. ఒక్క క్షణంలో ఆయన ముందు వ్రాలాను. అనిమిషంగా నిల్చిపోయాను. ఆయన్నాపాదమస్తకం తిలకిస్తూ. నా కళ్ళు చెమ్మగిల్లాయి. అది చాలలేదు. భోరున ఏడుద్దామనిపించింది.




"నేను ఒక్కడిన్ని దిగలేదు. నీసాయం కావాలి," అన్నారు చిరునవ్వుతో.

నేను యింకా దగ్గరకు వెళ్లి వారి చేయి అందిచ్చాను. నా బుజం మీద చేయి వేసి, నన్ను గట్టిగా పట్టుకుని క్రిందకి దిగారు.

"మీ సామానో?" అన్నాను.

తలుపవతల పెట్టివున్న లెదర్ సూట్ కేసు చూపించారు.

"ఇంతేనా?" అని అడిగాను.

"అంతే."

పార్వతి వెళ్లి సూట్ కేసు అందుకుంది. ఆయన నా బుజం చుట్టూ చేయేసి, నన్నాధారంగా చేసుకుని నడుస్తున్నారు. నేనూ ఆయనా వెనక సీట్లో కూర్చున్నాం. పార్వతి ముందుసీట్లో కూర్చుంది.

ఇంటిదగ్గరకు వచ్చాక కారు దిగుతూండగా ఆయన ఒకసా నలువైపులా చూసి "శకుంతలా! ఈ బంగళా నీదేనా?" అ అడిగారు.

"మనది," అన్నాను తల వంచుకుని.

"వెరీ నైస్, వెరీ నైస్," అంటూ లోపలకు వచ్చారు. సోఫాలో కూర్చోబెట్టి లోపలకు వెళ్ళి అయిదు నిముషాల్లో కాఫీ తీసుకువచ్చి యిచ్చాను.

లోపలకు పోయినప్పుడు పార్వతిని చాటుకు పిలిచి, "అయ్య గార్ని చూశావు కదే. ఎలా వున్నారు?" అని అడిగాను.

"నాకు నచ్చారమ్మా!" అంది మెరిసే కళ్ళతో.

కాఫీ త్రాగటం పూర్తి చేశాక "చాలా బాగుంది; ఇలాంటి కాఫీ త్రాగి చాలా కాలమైంది శకుంతలా!'' అన్నారు.

ఏం మాట్లాడాలో తెలియటంలేదు. ిగ్గుగా, భయంగా, కొత్తకొత్తగా వుంది.

''నన్నంత తేలిగ్గా గుర్తుపట్టగలుగుతా నుకోలేదు," అన్నారు కొంచెం ఆగి.

"మిమ్మల్ని గుర్తుపట్టకుండా ఎలా ంటాను?" నా గొంతు వొణికింది

"నువ్వు నన్ను పిలిచివుండకపోతే నేను మాత్రం నిన్ను గుర్తుపట్టలేకపోయివుండే వాడ్ని."

ఎన్నో అడుగుతా రనుకున్నాను. మామయ్య ఎప్పుడు పోయారు? అత్తయ్య కూడా లేదన్నమాట! యిన్నాళ్లూ ఎలా డిపావు? ఏమేమి చేశావు? - యిలా న్నో ప్రశ్నలు వేస్తారనుకున్నాను.

కాని వాటినిగురించి పట్టనట్టే ఊరు న్నారు. నా కంటికి నిర్వికారంగా, యోగిలా కనిపించారు. రాగాలూ, నురాగాలూ ఆయననుంచి దూరమై యాయనిపించింది. ఓ తపస్విలా గోచ ంచారు.

"మీకు తలంటుతాను రండి! ప్రయాణంలో అలిసిపోయివుంటారు." అనగలి ను ఎలాగో.

"అవునవును. వళ్ళంతా చికాకుగా ంది," అంటూ లేవటానికి సన్నద్ధు య్యారు.

బాత్‌రూమ్‌లో పార్వతి పులుసు స్తుంటే, నేనాయనకు చక్కగా తలం ను. "కుంకుడుకాయ రసంతో పోసు ని ఎన్నాళ్ళయిందో," అంటున్నారు ళ్ళు గట్టిగా మూసుకుని.

రెండు నెలలక్రితం పేపరు చదువు ండగా ఒక వార్త కనిపించి విభ్రాంతు ల్ని అయాను. అమెరికాలో లిడర్లీ ంపెనీలో డైరెక్టరుగా వుంటూ ప్రస్తా దలైన అనేక వ్యాధులకు మందు కనిపెట్టిన ప్రముఖ భారతీయ శాస్త్రజ్ఞుడు శ్రీ వి సుందరరావు యీమధ్య కారు ప్రమాదానికి గురి అయి ఎడమకాలును పోగొట్టుకున్నారనీ, ఆస్పత్రిలో చికిత్స పొంది ఆరోగ్యంగానే వున్నారనీ, అయితే స్వదేశంమీదకు దృష్టిమళ్ళి, పరిస్థితులు అనుకూలిస్తే అక్కడకు వెళ్ళిపోదామనుకుంటున్నారనీ వుంది.

నేను వెంటనే లిడర్లీ కంపెనీ చిరునామాకు ఉత్తరం రాసేశాను. అందులో "నేనింకా బ్రతికేవున్నాను. మీ రాక కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాను. ఎప్పుడు వస్తారో రాయండి,'' అని రాశాను.

దానికి జవాబు వచ్చింది. భారతదేశం వచ్చేస్తున్నాననీ, వివరాలు త్వరలో తెలియబరుస్తాననీ రాశారు.

పదిరోజుల క్రితం మరో లేఖ వచ్చింది. అయిదారు రోజుల్లో బయలుదేరుతున్నాననీ, ప్లేన్‌లో బొంబాయి చేరుకున్నాక, అక్కడినుంచి వైర్ యిస్తాననీ రాశారు.

నిన్న సాయంత్రం వైర్ వచ్చింది, ఏ ట్రెయిన్‌లో వచ్చేదీ తెలియబరుస్తూ.

తలంటు అయిపోయాక ఆయనే బుజం క్రింద కర్ర సహాయంతో యింట్లోకి నడిచి వెళ్ళారు; పట్టుకుంటానంటే "వద్దు శకుంతలా, ఇలా నడవటం అలవాటు చేసుకోనియ్యి,'' అని మృదువుగా వారించారు.

బీరువాలోంచి ఆయన కోసం దాచిన కొత్త గ్లాస్కోపంచ బయటకు తీశాను. ఆయన దానివంక విస్తుపోతూ చూసి ''ఏమిటీ? పంచ కట్టుకోమంటావా? ఎన్ని సంవత్సరాలయిందో కట్టుకుని. మరిచిపోయాను,'' అన్నారు అదుర్దాగా.

"ఫర్వాలేదు. ఒకసారి అలవాటంటూ వుంటే, ఎన్ని సంవత్సరాలు గడిచినా, ప్రయత్నిస్తే యిట్టే గుర్తువస్తుంది," అని బలవంతం చేసి ఆయనతో కట్టించాను. ఆయనను పంచా, లాల్చీలో చూడాలని నా కోరిక. అంతకన్నా ఏంలేదు. పాపం, కట్టుకోవడానికి చాలా యిబ్బందిపడ్డారు. ఒక కాలుకూడా సగంవరకూ లేదేమో, మరీ ప్రయాస అయింది. మధ్య మధ్య నేనుకూడా సాయం చేశాను.

కట్టుకోవటం పూర్తిఅయి పడక్కుర్చీలో కూర్చున్నాక ఓ ప్లేటులో జున్ను తెచ్చి బల్లమీద పెట్టాను.

ఆయన ప్లేటువంక చూసి, "ఏమిటిది? జున్నా? నేను తినకూడదే. నేను డయాబిటిస్ పేషంటుని శకుంతలా!" అన్నారు.

నా మనసు చివుక్కుమంది. ''రేపటి నుంచీ ఆహార నిబంధనలన్నీ అమలులో పెట్టుదురుగానీ, ఈ ఒక్కరోజుకి తీసుకోండి,'' అన్నాను బ్రతిమిలాడుతూ.

"సరే" అని పళ్ళెం అందుకుని సగం తిని సగం వదిలేశారు. ''ఇంక చాలు శకుంతలా!'' అన్నారు.

అంతసేపూ నేను నిలబడేవున్నాను.

''కూర్చో శకుంతలా! ఎంతసేపు అలా నిలబడతావు," అన్నారు నా ముఖంలోకి నిదానించి చూసి. ఆయన కెదురుగుండా వున్న సోఫాలో కూర్చున్నాను.

అనుకోకుండా ఆయనకేసి చూశాను. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. వెంటనే చూపు ప్రక్కకి త్రిప్పుకున్నాను.

నా బరువు తీరిపోయింది. ఇప్పు డెంతో నిశ్చింతగా వుంది, వారిని చూస్తే. వారిని కలుసుకున్నాక నా కేవిధమైన అసంతృప్తి కలగలేదు. నేను పొరపాటు చేయలేదన్న అచంచల ఆత్మవిశ్వాసమే యిప్పుడూ ఆవరించివుంది.

తల ప్రక్కకి త్రిప్పుకున్నప్పుడు గోడనున్న అద్దంలో నా ప్రతిబింబం కనిపించింది. ఆ ప్రతిబింబం నన్ను చూసి ఎగతాళి చెయ్యలేదు. నాలో జరిగిన ప్రతి మార్పూ నాకు తెలుసు. అప్పటి శకుంతలను కాను నేను. ఇప్పుడు నేను...ఇప్పుడు నేను...

"ఇన్నాళ్ళూ ఏం చేశావు శకుంతలా?

ఎలా కాలం వెళ్ళబుచ్చావు?" ఆయన నోటివెంబడి చివరికి ప్రశ్న వచ్చింది.

ఎంతో కాలం తర్వాత కలుసుకున్న భార్యాభర్తలు. దాంపత్య జీవితం క్షణమైనా రుచిచూడని భార్యాభర్తలు యిప్పు డెదురెదురుగా కూర్చున్నారు. ప్రేమవచనాలు లేవు. మధుర సంభాషణలు లేవు. ఉప్పెనలు లేవు. ఉద్రేకాలు లేవు.

"చెప్పవేం శకుంతలా? ఇన్నాళ్ళూ ఏంచేశావు?"

"ఆఁ" అంటూ ఆయనకేసి తిరిగాను. "గైనిక్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఆరునెలల క్రితమే రిటైరయ్యాను" అన్నాను.

★

